




మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం






బుధవారం 09 సెప్టెంబర్ 2026 ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం పేజీలు :- 3


# పోలీసు బలంతో ప్రజల గొంతు నొక్కలేరు











## -420 హామీలు అమలు చేసేలా చూడాలంటూ అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ శ్రేణుల వినతి

భానుపురి /సూర్యాపేట ప్రతినిధి

తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా హామీల అమలును ప్రశ్నించే ప్రతిపక్ష గొంతులను పోలీసు బలంతో నొక్కేయిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తూ రాజ్యాంగ హక్కులను కాల రాస్తుందని మాజీ రాజ్యసభ సభ్యులు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ లు అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా చివరి రోజు మంగలవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయమంటే సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం ఎదురుదాడికి దిగుతుందన్నారు. రాష్ట్రంలో రైతులు, విద్యార్థులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతిపక్షం ప్రశ్నిస్తే పోలీసులతో అణిచివేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. గత వారం రోజులుగా బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై, కాంగ్రెస్ ఇచ్చి హామీలపై ప్రజాస్వామ్య పద్దతిలో కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రశ్నిస్తుంటే అసెంబ్లీలో టీఆర్ఎస ఎమ్మెల్యేలపై ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేలపై దురుసుగా వ్యవహరించడం కాంగ్రెస్ ప్రబుత్వ దిగజారుడు తనమన్నారు. తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలు వలను తుంగలో తొక్కుతు ందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉపయోగించాల్సిన అధికార యంత్రాంగాన్ని ప్రతిపక్షా లను అణిచివేసేందుకు ఉపయోగి స్తుందన్నారు. నిరసన తెలిపే హక్కు ఇస్తామన్న కాంగ్రెస్ నేడు నిరసన తెలిపే హక్కును హరించి ప్రజాస్వామ్యాన్ని మోసం చేసిందన్నారు. రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకొని అధికారంలోకి వచ్చి రాజ్యంగ స్ఫూర్తిని తుంగలో తొక్కుతున్న కాంగ్రెస్కు బుద్ది చెప్పాలని ప్రజాస్వామ్య విలువల పాఠం చెప్పాలని అంబేద్కరు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంగిరేకుల నాగార్జున, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, మాజీ ఎంపీపీ నెమ్మాది బిక్షం, జిల్లా నాయకులు ఉప్పల ఆనంద్, బండారు రాజా, పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు సవరాల సత్యనారాయణ, బూర బాల సైదులు గౌడ్ మండలాల అధ్యక్షులు తూడి నర్సింహ్మారావు, వంగాల శ్రీనివాస్ దొంగరి యుగంధర్, జూలకంటి జీవన్ రెడ్డి నాయ కులు ఆకుల లవకుశ, ముదిరెడ్డి సంతోష్ రెడ్డి, ముదిరెడ్డి అనిల్ రెడ్డి ల తో పాటు ప్రజా ప్రతినిదులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## సూర్యాపేట రైల్వే ఉద్యమానికి ఉపాధ్యాయ లోకం అండ




భానుపురి /సూర్యాపేట టౌన్

హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు సాధారణ రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట రైల్వే సాధన సమితి చేపట్టిన 'లక్ష పోస్ట్‌కార్డుల ఉద్యమం'కు ఉపాధ్యాయ వర్గాల నుంచి మద్దతు లభించింది. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు తీకుళ్ళ సాయిరెడ్డి ఈ ఉద్యమానికి తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి స్వయంగా పోస్ట్‌కార్డు రాసి సూర్యాపేట ప్రజల రైల్వే ఆకాంక్షను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సూర్యాపేటకు హైదరాబాద్ నుంచి రైలు మార్గం కావాలన్నది ఈ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష అని సాయిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న సూర్యాపేటకు నేరుగా రైల్వే అనుసంధానం లేకపోవడం ప్రజలకు తీవ్ర లోటుగా ఉందన్నారు. విద్య, వైద్యం, ఉద్యోగం, వ్యాపారం, వ్యవసాయ అవసరాలతో నిత్యం హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే వేలాది మంది ప్రజలకు రైలు సౌకర్యం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ప్రజల ఆకాంక్షను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఒక లక్ష మంది ప్రజలతో ప్రధానమంత్రికి పోస్ట్‌కార్డులు పంపించాలన్న రైల్వే సాధన సమితి నిర్ణయం వినూత్నమైన ప్రజాస్వామ్య ఉద్యమమని ఆయన అభినందించారు. ఒక ప్రాంత అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాన్ని సాధించేందుకు ప్రజలను భాగస్వాములను చేస్తూ ఉద్యమాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. "సూర్యాపేటకు హైదరాబాద్ నుంచి రైలు మార్గం కావాలని ప్రధానమంత్రి కి లక్ష పోస్ట్‌కార్డుల ఉద్యమం ద్వారా విజ్ఞప్తి చేస్తున్న రైల్వే సాధన సమితికి నా అభినందనలు. ఈ ఉద్యమానికి నేను కూడా మద్దతుగా ప్రధానమంత్రి కి పోస్ట్‌కార్డు రాస్తున్నాను" అని సాయిరెడ్డి పేర్కొన్నారు. సూర్యాపేట రైల్వే సాధన ఉద్యమం ఏ ఒక్క సంఘానికో, వ్యక్తికో పరిమితమైనది కాదని, ఇది జిల్లా ప్రజల సమష్టి ఆకాంక్షగా మారాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, కార్మికులు, మహిళలు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఒక్కొక్కరి చేతిలోని చిన్న పోస్ట్‌కార్డు లక్ష గొంతుకలుగా మారి ఢిల్లీకి సూర్యాపేట ప్రజల ఆకాంక్షను వినిపించగలదని, ప్రజల నుంచి ఎంత విస్తృతమైన స్పందన వస్తే రైల్వే మార్గం అవసరాన్ని కేంద్ర ప్రభుత్వం అంత బలంగా గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా ప్రజల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్--సూర్యాపేట రైల్వే మార్గం సాధన కోసం జరుగుతున్న ప్రజాస్వామ్య పోరాటానికి తన మద్దతు కొనసాగుతుందని తీకుళ్ళ సాయిరెడ్డి స్పష్టం చేశారు.

## ఆశా వర్కర్స్ పై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్బంధాన్ని ఖడించండి



భానుపురి /సూర్యాపేట టౌన్

ముందస్తు అరెస్ట్ ల పేరుతో అక్రమ అరెస్టులు చేయడం సరైనది కాదని, ఈ చర్య ను తీవ్రంగా ఖశీడిస్తున్నామని బి.ఆర్ .టి.యూ జిల్లా అధ్యక్షులు వెంపటి. గురూజీ అన్నారు. రూ. తొమ్మిది వేల ఐదు వందల రూపాయలతో పని చేస్తున్న ఆశా వర్కర్స్ కు కుటుంబ పోషణ భారం గా మారిందని, ఒక పక్క ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను లక్షాది కారులను చేస్తామని చెప్పే ముఖ్యమంత్రి తక్కువ వేతనాలతో ఎలా లక్షాది అవుతారని విమర్శించారు. మెప్మా రిసోర్స్ పర్సన్స్ 5 వేలు,ఐకేపీ వి ఓ ఏ ల కి 5 వేలు,మధ్యాహ్నన్న భోజన కార్మికులకు 2 వేలు,ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్స్ కు 10 వేలతో ఎలా బ్రతుకు తున్నారో అనే ఆలోచన ప్రభుత్వా నికి ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. మాది ప్రజా పాలన అనిచెప్పే ముఖ్య మంత్రి వేతనం పెంపు కొరకు, న్యాయబద్ధమైన హక్కుల సాధన కోసం అసెంబ్లీ ముట్టడి కి వెళుతున్న ఆశా లను అరెస్ట్ చేయడం ఏమిటని, ప్రజా పాలనలో హక్కులు కాలరాస్తారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన మ్యాని పేస్టోలో ఆశా లకు 18 వేలు ఇస్తామని అన్నారని అదే డిమాండ్ యూనియన్ గా అమలు చేయమని అడుగు తున్నామని గురూజీ అన్నారు. ఆశా, అంగన్వాడీ, ఐకేపీ వి వోఏ, మెప్మా ఆర్పీ లు, మున్సిపల్ కార్మికులు, మధ్యాహన్న కార్మికులు సంఘ విద్రోహ శక్తులు కారని అతి తక్కువ వేతనం తో ప్రభుత్వం వారి శ్రమ ను దోపిడీ చేస్తున్న, అన్యాయానికి గురి అవుతున్న కార్మికులని అన్నారు.అరెస్టు అయిన వారిలో ఆశా యూనియన్ టౌన్ అధ్యక్షురాలు సక్కుబాయి, యూనియన్ జిల్లా నాయకులు సైదమ్మ, బైనా బాయి తదితరులు ఉన్నారు.

# సూర్యాపేట నుండి బుల్లెట్ ట్రైన్ వెళ్లాల్సిందే









భానుపురి /సూర్యాపేట టౌన్

హైదరాబాదు నుండి చెన్నై వరకు ఏర్పాటు చేస్తున్న బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని సూర్యాపేట ముందుగా వెళ్లాల్సిందే అంటూ మంగళ వారం సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. శ్రీ వాసవి మాత ఆలయంలో పూజలు అనంతరం ర్యాలీగా బయలుదేరి రైతు బజార్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రిలే నిరాహార దీక్షలో 26వ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సూర్యాపేట జిల్లాకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ మీదుగా మూడు బుల్లెట్ రైళ్లకు అనుమతి ఇచ్చినప్పటికీ గతంలో సూర్యాపేట మీదుగా రైలు మార్గం వెళ్లే విధంగా ప్రణాళికలు తయారుచేసి కొంతమంది స్వార్థపరుల ఆలోచనలతో రైలు మార్గాన్ని సూర్యాపేట మీదుగా వెళ్లకుండా పక్కదో బట్టిస్తున్నారని తెలిపారు. సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ వెళ్లే వరకు ఆర్యవైశ్యుల మద్దతు ఉంటుందని తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన దీక్ష సాయంత్రం ఐదు గంటలకు జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఉదయం దీక్షను సుధాకర్ పివిసి మేనేజింగ్ డైరెక్టర్ మీలామహదేవ్ ప్రారంభించారు. సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పెద్దిరెడ్డి రాజా, రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు గండూరి ప్రకాష్, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, నాయకులు కర్నాటి కిషన్, ధర్మార్జున్ , పూర రామ్మూర్తి యాదవ్, రాపర్తి శ్రీనివాస్, మొరిశెట్టి కోటేశ్వరరావు, బూపతి రాములు, మిర్యాల వెంకటేశ్వర్లు , చల్లమల్ల నరసింహ లు సంఘిభావం ప్రకటించారు. దీక్ష లో ఆర్యవైశ్య సంఘం గౌరవ సలహాదారులు ఉప్పల సత్యనారాయణ, ప్రధాన కార్య దర్శి బిక్కుమల్ల కృష్ణ, కోశాధి కారి వుప్పల శ్రవణ్ కుమార్, శ్రీ సంతోషిమాత దేవాలయం అధ్యక్షులు బ్రహ్మాండ్లపల్లి మురళీధర్, చల్లా లక్ష్మయ్య, తోట శ్యామ్ ప్రసాద్, మంచాల రంగయ్య, కర్నాటి రవి, చల్లా లక్ష్మికాంత్, రాచకొండ శ్రీనివాస్, ఈగ దయాకర్ గుప్త, మిట్టపల్లి రమేష్, తాళ్లపెల్లి రామయ్య, సోమ వెంకటేశ్వర్లు, సుమన్ వెంకన్న, గుడిపాటి రమేష్, సోమ ప్రవీణ్, బెలిదె అంజయ్య, బెజగం ఫణి, మహిళా సంఘం అధ్యక్షురాలు మిట్టపల్లి శ్రీదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ బెలిదె రాధ, తల్లాడ మోహన్, బొల్లం సురేష్, భోనగిరి కృష్ణ, తల్లాడ సోమయ్య, జూలకంటి నాగరాజు, సోమ సోమేశ్వర్, నవిలిపురి నరేందర్, మహంకాళి సోమయ్య, మహిళా సంఘం నాయకులు దేవరశెట్టి ఉమారాణి, లకుమారపు పద్మజ, అక్కినపల్లి సంతోషి, ఓరుగంటి లావణ్య, యర్క చర్ల శోభారాణిలు పాల్గొన్నారు. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అద్యక్షులు వెంపటి మధు సుధన్ ఆద్వర్యంలో పలువురు మిల్లర్ లు దీక్ష కు సంఘీభావం ప్రకటించారు.

# పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి పెద్దపీట





భానుపురి /సూర్యాపేట మున్సిపాలిటీ

సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది గ అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ సాధారణ కౌన్సిల్ (జనరల్ బాడీ) సమావేశంలో పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పలు కీలక ఎజెండాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి సంబంధించి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత రెండు రోజుల క్రితం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది ని కలిసి, ప్రతి సంవత్సరం తమకు అందజేసే సబ్బులు, బట్టలు, కొబ్బరి నూనె తదితర సంక్షేమ సామగ్రిని అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల విజ్ఞప్తి పై వెంటనే స్పందించిన చైర్‌పర్సన్, ఆ అంశాన్ని జనరల్ బాడీ సమావేశం ఎజెండాలో పొందుపరచగా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అదేవిధంగా గత 4 సంవత్సరాల 9 నెలలుగా పీఎఫ్ చెల్లింపులు పెండింగ్‌లో ఉన్న 120 మంది పారిశుద్ధ్య కార్మికుల పీఎఫ్ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేయాలని సమావేశంలో నిర్ణయించారు. కార్మికుల హక్కులు, సంక్షేమాన్ని పరిరక్షించడంలో మున్సిపాలిటీ బాధ్యతగా వ్యవహరిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.సూర్యాపేట పట్టణ సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన కొత్త మాస్టర్ ప్లాన్‌కు జనరల్ బాడీ సమావేశంలో ఆమోదం తెలిపారు. పట్టణ విస్తరణ, రహదారులు, మౌలిక వసతులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని రూపొందించిన మాస్టర్ ప్లాన్ భవిష్యత్ అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. అలాగే సూర్యాపేట పట్టణంలోని 60 ఫీట్ల రోడ్డు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు రహదారిని అనుసంధానం చేయడంపై సమావేశంలో చర్చించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని కలిసి అందించాలని నిర్ణయించారు. ఈ రహదారి అనుసంధానం పూర్తయితే పట్టణ ప్రజలకు రాకపోకల సౌలభ్యం మెరుగుపడటంతో పాటు కలెక్టర్ కార్యాలయానికి చేరుకోవడం మరింత సులభతరం కానుంది. సూర్యాపేట పట్టణంలో కొనసాగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. పనులను వేగవంతం చేసి, నిర్మాణ పనుల కారణంగా ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను వీలైనంత త్వరగా తొలగించేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యండి షఫీ ఉల్లా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ తో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొని పట్టణ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం తదితర అంశాలపై పలు




సూచనలు చేశారు.ప్రజా అవస రాలు, కార్మికుల సంక్షేమం, పట్టణ భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కౌన్సిల్ సమిష్టిగా కీలక నిర్ణయాలు తీసుకుంటోందని, సూర్యాపేట పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తుందని చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హమాలీ కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి



భానుపురి/ సూర్యాపేట టౌన్

రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్లు, గోదాములు,రైస్ మిల్లులు, సిమెంటు, ఎరువులు గోదాములు, పరిశ్రమలు, ప్రైవేట్ కంపెనీలలో పనిచేసే వేలాది హమాలీ కార్మికులు ఇప్పటికి చట్టబద్ధమైన రక్షణ లేకుండా పనిచేస్తున్నారని వీరికి సమగ్ర భద్రత కూడిన చట్టం రూపొందించాలని ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య అన్నారు. ఈనెల 15న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగు హమాలీ కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలంటూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంట నాగయ్య పాల్గొని మాట్లాడుతూ అసంఘటితరంగా హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం, ప్రత్యేక సంక్షేమ బోర్డు లేకపోవడంతో కార్మికులు భవిష్యత్తు అందకారంగా మారుతుందని తక్షణమే ఆవైపు చర్యలను చేపట్టాలని అన్నారు. పని ప్రదేశాలలో అనేక ప్రమాదాలు జరిగి వారి కుటుంబాలు రోడ్లమీదకు వస్తున్న ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం అన్యాయమని వారికి జీవన భృతి కల్పించి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన తర్వాత కనీసం పనిచేయలేనీ నిస్థితికి నెట్టివేయబడుతున్నారని వారందరికీ పదివేల రూపాయల పెన్షన్ సౌకర్యం కల్పించి వారిని ఆదుకోవాలని, పీఎఫ్, ఈఎస్ఐ ,ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల హమాలీలకు గుర్తింపు కార్డులు జారీ చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని తెలియజేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ నెల 15న జరిగే రాష్ట్ర సదస్సులో జిల్లా నుండి పెద్ద ఎత్తున హమాలీ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ టి యు జిల్లా కమిటీ సభ్యులు సామా నర్సిరెడ్డి హమాలీ యూనియన్ జిల్లా నాయకులు మడిపడిగా పురుషోత్తం, లక్ష్మయ్య, మల్లేష్,రమేష్, జాలే గురుమల్లు, జానయ్య,వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# 104 గ్రాముల గంజాయి స్వాధీనం



భానుపురి /ఆత్మకూరు (ఎస్)

సూర్యాపేట జిల్లా ఆత్మకూరు (ఎస్) పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయితో పట్టుబడిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. రామన్నగూడెం గ్రామానికి చెందిన అల్లిపురి అఖిల్ (23), మట్టపల్లి గంగరాజు (22)లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి సుమారు 104 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆత్మకూరు (ఎస్) పోలీసులు రామన్నగూడెం గ్రామంలో తనిఖీలు నిర్వహించగా, ఇద్దరు యువకులు గంజాయితో పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసిన పోలీసులు, అనంతరం వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ మంగళవారం సర్కిల్ పోలీస్ కార్యాలయంలో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు (ఎస్) ఎస్సై ఐలయ్యతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ.. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత జీవితాలు నాశనం అవుతున్నాయని అన్నారు. యువత మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా చదువు, ఉద్యోగం, క్రీడలు వంటి సానుకూల మార్గాల్లో ముందుకు సాగి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ విక్రయాలు, వినియోగంపై పోలీస్ శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తుందని సీఐ తెలిపారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యం

భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్

అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన తెలిపారు. మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్ సమావేశ మంది రంలో ఎస్ఐఆర్ కార్యక్రమంపై జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ ప్రతి అధికారికి అత్యున్నత ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబం ధించి ఇప్పటివరకు ఎటువంటి ప్రధాన సమస్యలు గుర్తించలేదని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజలు, ఓటర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, సందేహాలను రాజకీయ పార్టీల ప్రతినిధుల ద్వారా తెలుసుకోవడమే ఎన్నికల సంఘం ఉద్దేశ్యమని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎప్పుడైనా తనను సంప్రదించి సమస్యలను తెలియజేయవచ్చని, చిన్న సమస్య అయినప్పటికీ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హత లేని ఓటర్లను తొలగించడంతో పాటు, అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉండేలా చూడటమే ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన ధృవపత్రాల్లో అవసరమైన ధృవ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని, అధికారులు తమ స్థాయిలో ధృవ పత్రం సమర్పణ నుంచి మినహాయింపు ఇవ్వలేరని పేర్కొన్నారు. వివాహిత మహిళల విషయంలో పేర్ల మార్పులు, పేర్లలో అక్షర దోషాలు, ఇతర చిన్నపాటి క్లరికల్ తప్పిదాలను స్వీయ ప్రకటన ద్వారా సరిచేసుకునే అవకాశం ఉందని తెలిపారు. మిగిలిన అంశాల్లో ఎన్నికల సంఘం సూచించిన ధృవ పత్రాల్లో ఒకదాన్ని తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ఓటర్లకు అవసరమైన ధృవ పత్రాలపై రాజకీయ పార్టీలు అవగాహన కల్పించి, విచారణకు హాజరయ్యే సమయానికి సంబంధిత పత్రాలను సిద్ధంగా ఉంచుకునేలా




సహకరించాలని కోరారు. రాజకీయ అనుబంధంతో సంబంధం లేకుండా ప్రతి అర్హత కలిగిన ఓటరుకు ఓటు హక్కు కల్పించేందుకు ఎన్నికల సంఘం అందరితో సమన్వయంతో పనిచేస్తు ందని తెలిపారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ సర్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. పోలింగ్ కేంద్రాలు, ఓటర్లు, నియోజకవర్గాలు, ఈఆర్వోలు,ఏ ఈ ఆర్ ఓ లు, బిఎల్ఓ,బి ఎల్ ఏ నియామకం, సర్ లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని వివరాలన్నింటినీ వివరించారు. జిల్లాలో రేషనలైజేషన్ తర్వాత 1212 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ప్రతి పోలింగ్ కేంద్రానికి బిఎల్ఓ ను నియమించడం జరిగిందని, అలాగే 4,286 మంది బిఎల్ఏలు ఉన్నారని , 10,08,252 మంది ఓటర్లు ఉండగా, 9,11,945 ఎన్యుమరేషన్ ఫామ్స్ ను డిజిటలైజేషన్ చేశామని, జిల్లాలో మహిళా పురుష ఓటర్ల నిష్పత్తి 50.97 గా ఉందని,7,457 మంది సీనియర్ సిటిజన్లు, 15,189 దివ్యాంగ ఓటర్లు ఉన్నారని, మ్యాపింగ్ కానీ, ఓటరు జాబితాలో చిరునామా, వయసు తదితర విషయాలలో తేడాలు న్న 194106 మంది ఓటర్లను గుర్తించి వారికి నోటీసులు జారీ చేశామని, విచారణ ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిపారు. నోటీసుల జారీ , హియరింగ్ పై ఈనెల 5,6 తేదీలలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. శని, ఆదివారాల్లో నిర్వహించే ప్రత్యేక ప్రచార దినాల ద్వారా ఈ దరఖాస్తులన్నింటినీ త్వరితగతిన పరిష్కరిస్తున్నారు. ప్రతి వారం బుధవారం రోజున వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఓటర్ల జాబితాలోణ'నో మ్యాపింగ్' కేసులకు సంబంధించిన వివరాలను పార్టీల ప్రతినిధులకు పారదర్శకంగా అందిస్తు న్నామని, వారి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నామని పేర్కొన్నారు. పేర్లలో తప్పులు, ఇతర క్లరికల్ పొరపాట్లు, వివాహిత మహిళల విషయంలో పేర్ల మార్పులు వంటి అంశాలను బీఎల్ఓకు స్వీయ ప్రకటన సమర్పించడం ద్వారా సరిచేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎక్కడైనా ఉద్దేశపూర్వకంగా అవకతవ కలకు పాల్పడినట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సూర్యాపేట జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు అన్ని రాజకీయ పార్టీలు ఇప్పటివరకు సహకరిస్తున్నాయని కలెక్టర్ పేర్కొ న్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల కోసం ఎస్ఐఆర్‌పై మరోసారి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిం చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు తప్పనిసరిగా విచారణకు హాజరు కావాలని, అవస రమైన ధృవ పత్రాలు లేని వారికి సంబంధిత ధృవ పత్రాలు పొందేందుకు వీలైనంత సహకారం అందిస్తామని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం నుంచే జిల్లా కలెక్టర్ ప్రజలకు, రాజకీయ పార్టీలకు మంచి అవగాహన కల్పించారని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురైన సమస్యలను పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, ఆర్డిఓ లు సూర్యాపేట, కోదాడ, హుజుర్నగర్ వేణుమాధవ్ రావు, సూర్యనారాయణ, శ్రీనివాసులు, తహసిల్దార్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బి యన్ చరిత్ర భవిష్యత్ తరాలకు అందించాలి

భానుపురి/సూర్యాపేట టౌన్

సూర్యాపేట జమ్మిగడ్డ లో యంసిపిఐ (యు) జిల్లా కమిటీ సభ్యుల ఒక రోజు రాజకీయ క్లాసు లింగం పల్లి రాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను యంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయం చేసింది అని ప్రారంభ సభ సెప్టెంబర్ 10 వ తేదీన ఉదయం 11 గం లకు హైదరాబాద్ బాగ్ లింగం పల్లి ఓంకార్ భవన్ బి యన్ హల్ లో జరుగుతుంది అని ఈ సభకు పెద్ద ఎత్తున ప్రజలు, ప్రజాతంత్ర వాదులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అభిమానులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ వరికుప్పల వెంకన్న, జిల్లా కార్యదర్శి యస్ కే నజీర్, పార్టీ జిల్లా నాయకులు ఈరి వీరన్న, నల్లూరి రమేష్, వేముల పెద్ద నర్సయ్య, సందు పట్ల పవన్ కళ్యాన్, బొల్లు ఎల్లమ్మ, మీసాల సైదులు, తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ అక్షరబాటలో మరో దళిత మేధావి





భానుపురి/హైదరాబాద్

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చూపించిన అక్షరబాటలో పయనిస్తూ విద్యనే సామాజిక మార్పునకు ఆయుధంగా మలుచుకున్న మరో దళిత మేధావి మామిడి అంజయ్య. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామానికి చెందిన ఆయన ఉన్నత విద్యలో మరో మైలురాయిని అధిగమించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'తెలుగులో పోలీసు చట్టాలు' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన అంజయ్య విద్యారంగంతో పాటు రాజకీయ, సామాజిక రంగాల్లోనూ తనదైన ప్రయాణం సాగించారు. ఉస్మానియా విశ్వవిద్యా లయంలో తెలుగు సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆయన, అనంతరం అదే విశ్వవిద్యాల యంలో ప్రొఫెసర్ చంద్రశేఖర్ మార్గదర్శకత్వంలో పోలీసు చట్టాలపై పరిశోధన చేపట్టారు. పోలీసు చట్టాలు ప్రధానంగా ఆంగ్లంలో ఉండటం వల్ల సామాన్య ప్రజలకు వాటిపై పూర్తి అవగాహన కలగడం కష్టమవుతోందన్న భావనతో ఈ అంశాన్ని పరిశోధనకు ఎంచుకున్నట్లు అంజయ్య తెలిపారు. చట్టం కేవలం న్యాయవాదులు, పోలీసులు, న్యాయ నిపుణులకు మాత్రమే పరిమితం కాకుండా సామాన్యుడికీ అర్థమయ్యే భాషలో అందుబాటులో ఉండాలన్నదే తన పరిశోధన లక్ష్యమని పేర్కొన్నారు. పోలీసు చట్టాలకు సంబంధించిన అంశాలను తెలుగు భాషలో అధ్యయనం చేసి ప్రజలకు చేరువ చేయడానికి చేసిన ఈ ప్రయత్నం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. విద్యారంగంతోనే పరిమితం కాకుండా ప్రజాజీవితంలోనూ అంజయ్య తనదైన ముద్ర వేశారు. రాజకీయాల్లోకి ప్రవేశించి అప్పటి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి జిల్లా పరిషత్ సభ్యునిగా విజయం సాధించారు. ఒకవైపు ప్రజాప్రతినిధిగా ప్రజా సమస్యలపై పనిచేస్తూనే మరోవైపు ఉన్నత విద్యపై ఆసక్తిని కొనసాగించి పీహెచ్‌డీ స్థాయికి చేరుకోవడం విశేషం. "చదువు, సంఘటితం అవ్వు, పోరాడు" అని అంబేద్కర్ ఇచ్చిన సందేశాన్ని ఆచరణలో చూపుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన ఒక దళితుడు ఉన్నత విద్యలో అత్యున్నత స్థాయికి చేరుకోవడం యువతకు స్ఫూర్తిదాయకమని ఆయన సన్నిహితులు పేర్కొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్, విశ్వవి ద్యాలయ ఛాన్సలర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా మామిడి అంజయ్య పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. తన పరిశోధన ప్రయాణంలో మార్గనిర్దేశం చేసిన అధ్యాపకులకు, సహకరించిన మిత్రులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు అంజయ్య కృతజ్ఞతలు తెలిపారు. పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ సాధించిన మామిడి అంజయ్యను పలువురు బంధుమిత్రులు, ప్రజాప్రతి నిధులు, మేధావులు అభినందించారు. సూర్యాపేట రైల్వే సాధన సమితి సైతం ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, ఆయన విద్యా ప్రస్థానం యువతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించింది.

## పట్టణంలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి



భానుపురి /సూర్యాపేట టౌన్

సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ప్రజా సమస్యలను పక్కకు పెట్టి అజెండా ఆమోదమే ప్రధానంగా సాగింది. సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చించకుండా అనవసర విషయాలపై అధికార పార్టీ కౌన్సిలర్లు మాట్లాడి సమయాన్ని వృదా చేశారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు మాత్రం పట్టణంలో ఆయా వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తమ గళం విప్పారు. అధికారంలో ఉన్నా పనులు చేయకుండా ప్రతిపక్ష కౌన్సిలర్లు మాట్లాడుతుంటే సమస్యలు వినకుండా ఏకపక్షంగా అజెండా అంశాలను ఆమోదించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంగిరేకుల నాగార్జున మాట్లాడుతూ సూర్యాపేట పట్టణ అబివృద్ధిని తామంతా కోరుకుంటున్నామన్నారు. మున్సిపాల్టీకి వస్తున్న ఆదాయాన్ని నెల నెలా కాకుండా కనీసం మూడు నెలలకు ఒకసారి అయినా చూపించమని అడిగామని అందుకు సమాదానం లేదన్నారు. అలాగే మున్సిపాల్టీలో 800మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తుంటే వార్డుల్లో కేవలం ఇద్దరు ముగ్గురు మాత్రమే పని చేస్తున్నారని దీంతో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని మిగిలిన వారంతా ఎక్కడ పని చేస్తున్నారో చెప్పాలన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రదానంగా తాగునీటి సమస్య ఉందని గత పదేళ్లలో మంచినీటి కొరత లేకుండా మాజీ మంత్రి జగదీష్ రెడ్డి నీళ్ళు అందించారని ఇప్పుడు మనకు వచ్చే నీళ్లు ఎటు పోతున్నాయి ఎందుకు తాగునీటి సమస్య ఏర్పడుతుందని ప్రశ్నించారు. అలాగే గతంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి పట్టణ అబివృద్ధికి సుమారు రూ.300ల కోట్లతో బడ్జెట్ తెచ్చి అబివృద్ధి చేశారని నేడు ఏ ఒక్క పనికి బడ్జెట్ లేదన్నారు. ఇప్పుడు అదికారంలో ఉన్న మీరెందుకు నిదులు తేవడం లేదని ఇదేమని అడిగితే మాకు మాట్లాడే అవకాశం లేకుండా దౌర్జన్యంగా మైకులు లాక్కుంటున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు గండూరి పావని కృపాకర్, ఈద ప్రవీణ్, పడదల సైదులు, తాహేర్ పాషా, జ్యోతి, ఇందుశ్రీ, విజయనాయక్ తదితరులు ఉన్నారు.

# 45 వ వార్డు లో మంచినీటి సమస్య ను పరిష్కరించాలి

-45 వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్



భానుపురి/సూర్యాపేట టౌన్

సూర్యాపేట పట్టణంలో 45 వార్డులో మంచినీటి సమస్య చాలా ఎక్కువగా ఉందని, ఇక్కడ నల్లా నీళు చాలా తక్కువగా వస్తున్నాయని 45 వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ అన్నారు. మంగళవారం నాడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మంచినీటి సమస్యపై ఆమె మాట్లాడారు. తరువాత మీడియాతో మాట్లాడుతూ 45 వ వార్డులో ప్రతిరోజు నీటి సమస్యలు ఎదురవుతున్నందున ప్రతిరోజు మూడు వాటర్ ట్యాంకర్లు పంపవలసిందిగా మున్సిపల్ చైర్మన్ కు విజ్ఞప్తి చేశారు. ఒక ట్యాంకర్ వస్తే అవి ఎవరికి సరిపోవడం లేదని, వార్డులో నల్లా నీరు రాక, బోర్లు ఎండిపోయి ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని కాబట్టి మున్సిపల్ చైర్మన్ చొరవ తీసుకొని ప్రతిరోజు మూడు టాంకర్లు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని అన్నారు. సూర్యాపేట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ లతో పాటు బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ వున్న వార్డులు కూడా అభివృద్ధి చేయాలని, అలాగే మొదటి సమావేశంలో ప్రతి వార్డుకు ఐదు లక్షల రూపాయల వ్యయంతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారని, ఇంతవరకు ఎక్కడ కూడా పనులు ప్రారంభం కాలేదని ఆమె అన్నారు.

## సూర్యాపేట నుండి రైలు మార్గం పునరుద్దించాలి




భానుపురి /సూర్యాపేట టౌన్

హైదరాబాదు నుండి చెన్నై వరకు ఏర్పాటు చేస్తున్న రైల్వే కారిడార్ ను సూర్యాపేట మీదుగా ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో మన భారత ప్రధానికి లక్ష ఉత్తరాలు రాయటం లో భాగంగా రాష్ట్ర ఆర్యవైశ్య మహిళా విభాగం లో ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ కలకోట అనిత శిబిరాన్ని సందర్శించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఉత్తరాన్ని రాశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట ద్వారా రైల్వే మార్గం ఏర్పాటు చేయడం ద్వారా సూర్యాపేట జిల్లా ఎంతో అభివృద్ధి చెందుతుంది అన్నాడు. ఈ కార్యక్రమంలో రైల్వే సాధన సమితి నిర్వాహకులు బిక్కుమల్ల ఉపేందర్, రాచూరి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## అడవిదేవులపల్లి లో శ్రీ సేవాలాల్ మహరాజ్ ఆలయ ప్రతిష్టా మహోత్సవం

భానుపురి/మిర్యాలగూడ



మిర్యాలగూడ నియోజకవర్గం అడవిదేవులపల్లి మండలం చంప్లతండా గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మించిన శ్రీ సేవాలాల్ మహరాజ్ ఆలయ ప్రతిష్టా మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ ప్రతిష్టా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు స్కైలాబ్ నాయక్ హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, స్కైలాబ్ నాయక్ స్వయంగా భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా స్కైలాబ్ నాయక్ మాట్లాడుతూ... సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గంలో మనమంతా నడవాలని, తండాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో భగవాన్ నాయక్, సూర్య నాయక్ ,గ్రామ పెద్దలు, తండా వాసులు, భక్తులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో వరుసగా 3 రోజులు సెలవులు

# ఉద్యోగులకు, విద్యార్థులకు పండగే!

-తెలుగు రాష్ట్రాల్లో ఉద్యోగులు, విద్యార్థులకు వరుసగా మూడు సెలవులు

-శని, ఆది, సోమవారాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు హాలిడేస్

-సెప్టెంబర్ 14న వినాయక చవితి పండగ సందర్భంగా ప్రభుత్వ సెలవు

-ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రారంభమైన చవితి మండపాల ఏర్పాట్లు



భానుపురి

తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులకు ఈ వారాంతంలో వరుస సెలవులు రానున్నాయి. వినాయక చవితి పండగతో పాటు శని, ఆదివారాలు కలిసి రావడంతో మూడు రోజుల పాటు సుదీర్ఘ వారాంతం (లాంగ్ వీకెండ్) రానుంది. ఫలితంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు మూతపడనున్నాయి. సెప్టెంబర్ 12వ తేదీ రెండో శనివారం, 13వ తేదీ ఆదివారం కావడంతో సాధారణ సెలవు దినాలు ఉన్నాయి. వీటికి అదనంగా సెప్టెంబర్ 14 సోమవారం నాడు వినాయక చవితి పండగ సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించింది. దీంతో శని, ఆది, సోమవారాల్లో ఉద్యోగులకు, విద్యార్థులకు వరుసగా మూడు రోజులు పాటు విరామం లభించనుంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో వినాయక చవితి వేడుకల సందడి నెలకొంది. స్థానికులు, ఉత్సవ కమిటీలు మండపాలను ఏర్పాటు చేస్తూ పండగ సన్నాహాల్లో నిమగ్నమయ్యారు. ఈ మూడు రోజుల వరుస సెలవులతో పండగ వాతావరణం మరింత సంతరించుకోనుంది. కాగా, వినాయక విగ్రహాల నిమజ్జనం రోజున కూడా ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను బట్టి స్థానిక సెలవు ప్రకటించే అవకాశం ఉంది.